RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 131 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 8-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

కందం

---------------

చదువును చులకనజేయకు
చదువుకు ధీటైనయట్టి సంపద లేదున్
చదువును నేర్చుము నధికము
చదువును పంచిన పెరుగును తరుగదు నెపుడున్

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




# మాకు మా రైతు ప్రయోజనాలే ముఖ్యం

## ట్రంప్ సుంకాలపై ప్రధాని మోడీ పరోక్ష హెచ్చరిక

- వారికి నష్టాన్ని కలిగించే విషయంలో రాజీపడబోం
- స్వామినాథన్ శతజయంతి ఉత్సవాల్లో ప్రసంగం

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత్ తన అవసరాలు, ప్రజయోజనాల విషయంలో ఎలాంటి రాజీపడబోదని, ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఎవరి ఒత్తిళ్లకో లొంగి నడుచుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను రెట్టింపు చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటివరకు ఉన్న 25శాతం సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు- ప్రకటించారు. ఈ పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు. -మిగతా 2 లో



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

- నామినేషన్లకు 21 చివరితేదీ..25న ఉపసంహారణ
- సెప్టెంబర్ 9న రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నిక

**న్యూఢిల్లీ**

సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం తాజాగా గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారికంగా నామినేషన్ పక్రియను ప్రారంభించింది. నోటిఫికేషన్‌లోని వివరాల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 21 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహారణకు చివరి తేది ఆగస్టు 25గా నిర్ణయించారు. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పార్లమెంటు- వర్షాకాల సమావేశాల మొదటిరోజే ఆకస్మికంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనివార్యంగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగనుంది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ నిర్వహించే పరోక్ష ఎన్నికల ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు.
రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది. -మిగతా 2 లో

# బీసీ బిల్లును వెంటనే ఆమోదించండి

## బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోండి



- 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఆర్డినెన్స్
- రాష్ట్రపతిని నేరుగా కలసి విన్నపిస్తాం
- బీజేపీ, బీఆర్ఎస్‌ల కితాబు అవసరం లేదు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతోమాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ 42శాతం ఇవ్వాలన్నది తమ కమిట్మెంటని అన్నారు. రిజర్వేషన్ సాధనకోసం తాము చేయాల్సింది చేశామని చెప్పారు. కులగణన, రిజర్వేషన్ల సాధనలో తమ చిత్త శుద్ధిని ఎవరు శంకించలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వంగా అన్ని విధాల పక్రియ పూర్తి చేశామన్న రేవంత్.. ప్రస్తుతం బీసీల రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉందన్నారు. కేంద్రం, బీజేపీ కోర్టులో రిజర్వేషన్ల అంశం ఉందన్నారు. వాళ్లకు నిజంగా బీసీలపై ప్రేమ -మిగతా 2 లో



## బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం

- కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లోబీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే -మిగతా 2 లో




## ఓట్ చోరీ

- మహారాష్ట్ర ఎన్నికల్లో 40లక్షల ఓట్లు రహస్యంగా జోడించారు
- ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు..!

**న్యూఢిల్లీ**

కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఆయన మీడియా సమావేశం నిర్వహించి ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో 40లక్షల ఓట్లు రహస్యంగా జోడించారని ఆరోపించారు. 2024 లోక్‌సభ, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య ఈ ఓటర్లు ఓడించారన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ వరుసగా ఎన్నికల కమిషన్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే.మహారాష్ట్ర, కర్నాటకతో పాటు పలు చోట్ల ఓటర్ల జాబితా ఆధారంగా చేసుకొని ఈసీపై మండిపడుతున్నారు. ఓటర్ల జాబితాలో చేర్చిన లక్షలాది ఓటర్లను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా ఓట్లను దొంగిలిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్‌ను -మిగతా 2 లో



## చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

- చేనేత ఉపాధి మాత్రమే కాదు...వారసత్వ కళ
- పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభిచిన తుమ్మల

**హైదరాబాద్,**

చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా -మిగతా 2 లో

## మనము తగ్గేదేలే అనాల్సిందే



- భారత్ ప్రతీకారం తీర్చుకోవాలి..
- అమెరికా దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించాల్సిందే
- ట్రంప్ టారిఫ్స్‌పై శశిథరూర్

**న్యూఢిల్లీ,**

భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. ఆగస్టు 27 నుంచి కొత్త టారిఫ్ అమల్లోకి రానుంది. కొత్త టారిఫ్ కారణంగా పలు రంగాలు ఘోరంగా దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి. మొట్టమొదటిగా వస్త్రాలు, ఆటో రంగం, సముద్ర ఫుడ్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. ట్రంప్ విధించిన సుంకాలకు భారత్ కూడా ప్రతీకారం తీర్చుకోవాలని సూచించారు. అమెరికాతో చర్చలు ఫలించకపోతే అమెరికా దిగుమతులపై కూడా 50 శాతం సుంకాలు విధించాలని.. అప్పడే ట్రంప్ దిగొస్తారని పేర్కొన్నారు. అయినా మనపై ట్రంప్ ఎందుకు అంత కోపంగా ఉన్నారో తెలియడం లేదన్నారు. -మిగతా 2 లో

# అందరి లెక్కలు సరిచేస్తాం


- కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు
- మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారు
- పార్టీమారిన ఎమ్మెల్యేల తీరు అధ్వాన్నం
- తెలంగాణ భవన్‌లో కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండున్నరేళ్లలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో పరిగి నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూములు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు -మిగతా 2 లో



## బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ఒత్తిడిపెంచండి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం వినతి
- మంత్రులతో కలసి ఖర్గేతో భేటీ అయిన రేవంత్
- బీసీ బిల్లును బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని ఆరోపణ
- బీఆర్ఎస్ శిఖండిపాత్ర పోషిస్తుందని మండిపాటు



**న్యూఢిల్లీ,**

బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని సిఎం రేవంత్ నేతృత్వంలోని బృందం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. పార్లమెంట్‌లోని రాజ్యసభ విపక్ష నేత -మిగతా 2 లో

# మాకు మా రైతు ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి తరువాయి)

దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్యం, టారిఫ్‌ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే. భారత్ సిద్ధమే అని మోదీ వ్యాఖ్యానించారు. ఎం.ఎస్.స్వామినాథన్ గౌరవార్థం స్మారక నాణెం, స్టాంపును కూడా విడుదల చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు సహా భారతీయ వస్తువులపై సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్‌పై ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా దాన్ని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక, కొత్తగా విధించిన అదనపు 25శాతంసుంకాలను ఈ నెల 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. ముఖ్యంగా రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అగ్రరాజ్యం ఆగ్రహించినట్లు తెలుస్తోంది. మరోవైపు, రష్యా నుంచి న్యూదిల్లీ చమురు కొనుగోలును కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను భయపెడుతున్న సంగతి తెలిసిందే. తన మాట వినటం లేదన్న కోపంతో ఇండియాపై ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించారు. రష్యాతో చమురు ఒప్పందాలు క్యాన్సిల్ చేసుకోకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ భారత్ మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలోనే డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ టారిఫ్‌ల విషయంలో ఓ క్లారిటీ- ఇచ్చారు. ట్రంప్ మతిపోయేలా సమాధానం ఇచ్చారు. మేము వెనక్కు తగ్గే అవకాశమే లేదు. మాకు రైతుల సంక్షేమమే ముఖ్యం. అదే మా ప్రధాన లక్ష్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల విషయంలో భారత్ ఎప్పుడూ వెనక్కు తగ్గదు. మాకు తెలుసు. దీని కారణంగా చాలా పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని. దానికి కూడా మేము సిద్ధమే. భారత్ కూడా సిద్ధమే అని మోదీ స్పష్టం చేశారు.

# బీసీ బిల్లును వెంటనే ఆమోదించండి

(మొదటి తరువాయి)

ఉంటే బీసీ బిల్లును ఆమోదించాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచడం కోసంబీసీలకు న్యాయమైనా వాటా కోసమే తమ పోరాటమని సీఎం రేవంత్ చెప్పారు. జంతర్ మంతర్ వేదికగా తమ వాణిని బలంగా వినిపించామన్నారు. జంతర్ మంతర్ ధర్నాపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలు విడ్డూరమన్నారు. తమ కమిట్ మెంట్ కు వాళ్ల సర్టిఫికేట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు రేవంత్. ప్రజలను అబద్ధపు మాటలు చెప్పి మభ్యపెట్టబోమని... అది తమ నైజం కాదన్నారు. బీసీ లకు రాహుల్ ఇచ్చిన మాటను అమలుచేడమే తమ టార్గెట్ అని తెలిపారు. మోదీ చేతుల్లోనే బీసీ రిజర్వేషన్ నిర్ణయం ఉందన్నారు సీఎం రేవంత్. తమ ఆఖరి పోరాటాన్ని పూర్తిచేశాం.. ఇక బీజేపీ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రపతికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు రేవంత్. కేంద్రం బిల్లుకు ఆమోదించక పోతే.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా వెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం తీసుకుంటాం మన్నారు. లోకల్ బాడీ ఎన్నికలను సెప్టెంబర్ 30 లోపు నిర్వహించాలని హైకోర్ట్ చెప్పిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూస్తాం. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించాం. కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు మా వద్ద 3 మార్గాలు ఉన్నాయి. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలి. జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వస్తుంది. కాబట్టి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయి. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయి. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వడం. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం అని సీఎం తెలిపారు. సమయం కూడా తక్కువగా ఉందని అందుకు అనుగుణంగా తమ కార్యాచరణ ఉంటుందని అన్నారు

## మనమూ తగ్గేదేలే అనాల్సిందే

(మొదటి తరువాయి)

చైనాకు 90 రోజులు గడువు ఇచ్చారని.. మనకు మాత్రం 21 రోజులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. మనం కూడా 50 శాతం సుంకం విధిస్తేనే దారిలోకి వస్తారని పేర్కొన్నారు. భారతదేశం ప్రస్తుతం అమెరికా దిగుమతులపై 17 శాతం సుంకాలను విధిస్తోందని.. దానిని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మీరు చేస్తే.. మేము చేస్తామన్న ధోరణిలో బెదిరించాలన్నారు. రష్యా దగ్గర చమురు తక్కువగా దొరుకుతుంది కాబట్టే భారత్ కొనుగోలు చేస్తుందని చెప్పుకొచ్చారు. ఏ దేశమైనా అదే పని చేస్తుందన్నారు. ఏ ప్రభుత్వమైనా అన్నదాతలకు నష్టం కలిగించే చర్యలకు పూనుకో కూడదని శశిథరూర్ సూచించారు. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధం పెట్టు-కున్నందుకు జరిమానాగా మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు- ట్రంప్ హెచ్చరించారు. ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే దీన్ని అన్యాయంగా విదేశాంగ శాఖ పేర్కొంది. ఇదిలా ఉంటే అమెరికా బృందం ఈనెలలో భారత్‌లో పర్యటించనుంది. అప్పుడైనా అమెరికాలో మార్పు వస్తుందేమో చూడాలి.

## అందరి లెక్కలు సరిచేస్తాం

(మొదటి తరువాయి)

కష్టపడాల్సి వస్తోంది. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారు. ఐఏఎస్‌లు రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు ఉన్నప్పుడు కాదు.. నాట్లు- వేసేటప్పుడు రైతుబంధు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్‌ఎలాన్‌ను ప్రవేశపెట్టాలి. రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టు-కుంది. అందుకే దిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేకపోయారు.. అందుకే ఓడిపోయాం. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి అందరం కలిసికట్టు-గా పనిచేయాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీకు మూడు చెరువుల నీళు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనవసరంగా గెలిపించామని రైతులు, మహిళలు, నిరుద్యోగులు బాధపడుతున్నారు. మొన్ననే నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌కు సంవత్సరికం చేశారు. కొడంగల్‌లో విషయం అర్థమైంది కాబట్టే కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీలో ఉండే ప్రయత్నం చేయట్లేదు. ఎక్కడ కోల్పోయామో అక్కడే వెతుక్కోవాలి. నేల విడిచి సాము చేయొద్దు. గట్టిగా పని చేస్తే మనమే గెలవబోతున్నాం. అప్పుడు అధికారులందరూ మన చుట్టే తిరుగుతారు. పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం అని కేటీ-ఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విపరీతమైన కోపం ఉంది. మనకు ఓటేయడానికి ప్రజలు సుముఖంగా ఉన్నారు. అవసరమైతే మనం చేసిన తప్పులను క్షమించండి అని అడగాలి. పద్ధతిగా పని చేయాలి. పోయినా పదేండ్లలో పార్టీని పెద్దగా చూడలేదు. వచ్చేసారి కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ఆర్థికంగా బలోపేతం చేస్తాం. పార్టీ నిర్మాణంపై కూడా దృష్టి పెడుతాం. బీఆర్ఎస్ ఉండనే ఉండదు బీజేపీలో పోతదని తలకు మాసినోళ్లు అంటు-న్నరు మనకేం కర్మ పట్టింది. తెలంగాణ ఉన్నంతకాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది. రెండు పార్టీలకు మూడు చెరువుల నీళ్లు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం. మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం అని గులాబీ సైనికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇకపోతే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు కేటీఆర్ చురకలంటించారు.

## బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ఒత్తిడిపెంచండి

(మొదటి తరువాయి)

ఛాంబర్‌కు వెళ్లిన సీఎం బృందం బీసీ పోరుబాట ధర్నా, ఇతర కార్యక్రమాల గురించి ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలో కులగణన జరిగిన తీరు, అసెంబ్లీలో బిల్లుల ఆమోదం అంశాలను వివరించారు. బిల్లులను ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు ఇండియా కూటమి పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపిన విషయాన్ని ఖర్గేకు సీఎం వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో కులగణన చేపట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ సర్వే లెక్కల ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించి రాష్ట్రపతికి పంపాం. ఆ రిజర్వేషన్లపై పోరాడేందుకే దిల్లీకి వచ్చాం. జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించి కేంద్రాన్ని నిలదీశాం. గల్లీలో కాదు.. దిల్లీలోనే తేల్చుకుందామని దేశ రాజధానికి వచ్చాం. ఈ ధర్నాకు 100 మంది ఎంపీలు మద్దతు ఇచ్చారని సిఎం అన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా అడ్డుకున్నారు. ఆ అపాయింట్‌మెంట్ కోసం మంత్రివర్గం మొత్తం ఎదురు చూస్తోంది. రాష్ట్రపతిని కలిసే అవకాశం మాకు ఇవ్వకపోవడం శోచనీయం. ముస్లిం రిజర్వేషన్ల సాకుతో ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు భాజపా చూస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని భాజపాతో భారత రాష్ట్ర సమితి అంటకాగుతోంది. భాజపా తప్పిదాలను భారత రాష్ట్రసమితి నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. మా ధర్నాలో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీలు పాల్గొనలేదు సరికదా.. మమ్మల్ని అవహేళన చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయి. వారిని బీసీ ద్రోహులుగా తెలంగాణ సమాజం భావిస్తోంది. ఏ సమస్యను దీర్ఘకాలం వాయిదా వేసినా అది మిమ్మల్నే బలితీసుకుం టుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలుపాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ నేతలు అందరూ ఢిల్లీ వెళ్లీన సంగతి తెలిసిందే. జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, అమిత్‌షా అడ్డుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉందని విమర్శించారు. రిజర్వేషన్లపై బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి ధర్నాలో బీఆర్ఎస్ ఎందుకు పాల్గొనలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ధర్నాలో పాల్గొనకపోగా అవహేళన చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. కులగణనలో సంపూర్ణ వివరాలు సేకరించామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బిల్లులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని ఇ÷రా చట్టం చేసిందని, ఇ÷రా చేసిన చట్టాన్ని అధిగమించేందుకే ఆర్డినెన్స్ తీసుకొచ్చినట్లు- చెప్పారు. 4 నెలలు గడుస్తున్నా బిల్లులను రాష్ట్రపతి ఆమోదించలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం క్షేత్రస్థాయిలో అన్ని ప్రయత్నాలు చేసినట్లు- తెలిపారు. శాసనసభలో ఏకగ్రీవ ఆమోదంతోనే చట్టాలను ఢిల్లీకి పంపామని పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు
# పోరాడుతాం

(మొదటి తరువాయి)

ఆరోజే చర్చ జరిగేది. కానీ ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో దిల్లీకి వచ్చిన తర్వాత మీరు ముస్లింల పేరుతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. వారికి రిజర్వేషన్లు ఇప్పుడే కొత్తగా ఇవ్వడం లేదన్నారు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించ దల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బిసిలు బిజెపిని తిరస్కరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బిజెపి చావుతప్పి కన్నులొట్ట అన్నట్లు-గా గెలిచిందని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతామని సవాల్ విసిరారు. బిసి రిజర్వేషన్లు పెంచపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ కోటాను అడ్డుకునే కిషన్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి బీసీలపై మాట్లాడేమాటలు కరెక్ట్ కాదన్నారు. బీసీ కోటా ఇవ్వడం కుదరదని కిషన్ రెడ్డి లేఖ ఇవ్వాలన్నారు. బీసీ కోటాకు బీజేపీ నేతలు అడ్డుపడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. సమగ్ర కులగణ సర్వేను పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. అశాస్త్రీయమైన సర్వే చేసి, బీసీల సంఖ్యను తగ్గించారని కిషన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత దీనికి 10 శాతం ముస్లింలను చేర్చి.. బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు . తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల బీసీలకు కేవలం 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అందుతాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది బీసీలను మోసం చేయడమేనని చెప్పారు. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని బీజేపీ అంగీకరించదన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు తొలగిస్తే, బీసీ రిజర్వేషన్ల బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు కిషన్ రెడ్డి. బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే వాటిని అమలు చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. అది కాకుండా బట్టకాల్చి బీజేపీపై వేస్తామంటే ఊరుకోబోమని మండిపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. సీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది..దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీదే. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

(మొదటి తరువాయి)

ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఏ పార్టీ విప్‌కి కట్టుబడి ఉండనవసరం లేదు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు- సభ్యులు ఎన్నుకుంటారు. ఈ కారణంగా ఎన్‌డీఏ తన అభ్యర్థిని సులభంగా ఎన్నుకోగలదు. రెండు సభల ప్రస్తుత బలం 786. అభ్యర్థి గెలవడానికి 394 ఓట్లు- అవసరం. ఎన్‌డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 129 మంది ఎంపీలు ఉన్నారు మొత్తం ఓట్ల బలం 422. ఇది ఉపరాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన సంఖ్య కంటే అధికం.

# ఓట్ చోరీ

(మొదటి తరువాయి)

దోషిగా పేర్కొంటూ.. ఈసీ విశ్వసనీయత సందేహాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సేకరించిన ఆధారాలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ.. బీజేపీ ఓట్లను దొంగిలిస్తుందన్నారు. ఓటర్ల జాబితా అంశంపై ఈసీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చారని.. ఇది చాలా ఆందోళనకరమైన విషయమన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఓటర్ల సంఖ్య పెరగడం కూడా ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధిం సాక్ష్యాలను సేకరించేందుకు ఆరు నెలలు పట్టిందన్నారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన పలు ప్రశ్నలు సంధించారు. సాయంత్రం 5గంటల తర్వాత ఓటింగ్ ఎందుకు పెరిగింది ? ఎన్నికల కమిషన్ దీనికి సమాధానం చెప్పాలి లన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నలు అడిగిందని, ఇప్పటి వరకు ఒక్క సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా 2024 నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత, అసెంబ్లీ ఎన్నికలు 'రిగ్గింగ్' అయ్యాయని మా అనుమానాలు నిజమయ్యాయన్నారు.

## చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

(మొదటి తరువాయి)

అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం బాధ్యత మనందరి మీద ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రాన్నిచ్చే నేతన్నకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన చేనేత ప్రదర్శన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపుజీ చేనేత పురస్కారానికి ఎంపికైన చేనేత కళాకారులకు ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్రం చేనేత రంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు- వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు- తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా త్రిలింగ పట్టు- చీరలను,లోగోను మంత్రి ఆవిష్కరించారు. చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రిగారు హామీ ఇచ్చారు. చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన వస్త్ర ఎగ్జిబిషన్ లో 100 పైగా స్టాల్స్ ను మంత్రి ప్రారంభించి, వారు తయారుచేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యంగా జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు-చేసిన స్టాల్లోని వస్త్రాలను మంత్రి ప్రత్యేకంగా పరిశీలించి అభినందించారు. అంతేకాకుండా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎన్నికైన వారు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించిన ఆయన, వారిని అభినందించారు.

## 2025 ఆగస్టు 8, శుక్రవారం




**తిథి**
చతుర్దశి - రాత్రి 10:26 వరకు
పౌర్ణమి -ఆ తర్వాత ప్రారంభం
**నక్షత్రం**
శ్రవణం - ఉదయం 1:28 వరకు
ధనిష్ఠ -ఆ తర్వాత మొదలు
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: 4:27 - 5:13
అభిజిత్ ముహూర్తం: 12:00 - 12:52
అమృతకాలం: సా. 4:31 - 6:23
**అశుభ సమయాలు**
రాహుకాలం: 10:52 - 12:28
యమగండం: 3:34 - 5:10
గులికకాలం: 7:38 - 9:15
దుర్ముహూర్తం: 8:18 - 9:10 & 12:52 - 1:43
వర్జ్యం: సా. 4:31 - 6:23

## డివిజన్ సందర్శించి అభివృద్ధికి సహకరించండి

### - ఎ.వి. రమణ విజ్ఞప్తి



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని 12వ డివిజన్ శివారు ప్రాంతంగా ఉండి, గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోందని మాజీ కార్పొరేటర్ ఎ.వి. రమణ పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి సహకరించేందుకు కమిషనర్ డివిజన్‌ను సందర్శించాలని ఆయన వినతిపత్రం ద్వారా కోరారు. ఏఓఎస్, రాంచంద్రాపూర్, వెంకటేశ్వర కాలనీల పనులు సీఎం హామీ నిధులతో ప్రారంభమైనా ఇంకా పూర్తి కాలేదని, బతుకమ్మ, హస్నాపూర్ కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలని కోరారు.

## ఈఎస్ఐ హాస్పిటల్స్ అభివృద్ధిపై కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్



**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవియాను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి కలిశారు. రామగుండం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఉప్పల్ ఈఎస్ఐ హాస్పిటల్ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కార్మికుల ఆరోగ్య రక్షణకు ఈ ఆసుపత్రులు కీలకమని నేతలు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**ఆమనగల్లు, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని చేనేత కార్మికులు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరుగుతున్న జాతీయ చేనేత ఎగ్జిబిషన్‌కు తరలివెళ్లారు. ఈ ఎగ్జిబిషన్‌లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన కార్మికులకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు ఎంగలి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పాలది పురుషోత్తం, సత్యనారాయణ, ఆనందు, బుచ్చయ్య, వెంకటేష్, యాదయ్య, తిరుపతయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### లబ్ధిదారులకు 4.16 లక్షల చెక్కులు అందజేత




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేసిన 4,16,500 విలువైన 12 చెక్కులను బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ లబ్ధిదారులకు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తుంటే స్థానిక నేతలు కుర్చీల కోసం కొట్లాటలో మునిగిపోతున్నారు

### శ్రీరాములు అందెల



**మహేశ్వరం, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిపై స్థానిక నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేత, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీరాములు అందెల ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వరం మండల బీజేపీ అధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చొరవతో మహేశ్వరం, కందుకూరు మండలాలకు ఎంపీ లాడ్స్ ద్వారా రూ.1.25 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అలాగే కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి చొరవతో రాచులూరు నుండి పటేల్ గూడ వరకు, కొంగరకలాన్ నుండి మీరా?న్ పెట్ వరకు దాదాపు రూ.62 కోట్ల విలువైన రోడ్డు పనులు మంజూరయ్యాయని తెలిపారు. బీజేపీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తుంటే, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాత్రం కుర్చీల కోసం కొట్లాడుతున్నారని విమర్శించారు. తమ వ్యక్తిగత రాజకీయ కక్షల కోసం ఇక్కడి కార్యకర్తలను బలి చేయవద్దని హెచ్చరించారు. మరోవైపు రూ.1.52 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మరియు ఎంపీ లాడ్స్ నిధులను బీజేపీకి మంజూరు కాకుండా అడ్డుకున్నారని, జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, అలాగే అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై స్పందించాలని, అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిద్దె సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి యాదయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు పంతు నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షులు శ్రావణ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు రఘుపతి గౌడ్, శ్రీరాములు యాదవ్, రఘువీర్, పరమేష్, జంగయ్య, బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, చింటూ, బూత్ అధ్యక్షులు సత్యం, శివ, రాఘవేందర్, రాజు నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏపీఎం శేఖర్ గౌడ్‌ను కలిసిన వికలాంగుల సంఘం



**మంచాల, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల మండల నూతన అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం) శేఖర్ గౌడ్‌ను మంచాల గ్రామ వికలాంగుల సంఘం సభ్యులు కలిశారు. బదిలీలలో భాగంగా మేడ్చల్ నుండి మంచాలకు వచ్చిన ఆయనను గ్రామ వికలాంగుల సంఘం అధ్యక్షుడు కల్లె మల్లయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అశ్వాల బాల్ రాజ్, సంఘం సభ్యులు చీర సత్తయ్య, కొనల మల్లేష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన శోభ బదిలీపై మాడుగుల వెళ్లినట్లు సమాచారం.

## మిర్యాలగూడలో సాండ్ బజార్ ప్రారంభం

### -అందుబాటు ధరలో కావలసినంత ఇసుక
### - పేదలకు ఉపశమనం



**మిర్యాలగూడ, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో కావలసినంత ఇసుకను సరఫరా చేయాలనే లక్ష్యంతో మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి ఎక్స్ రోడ్ వద్ద సాండ్ బజార్ ను తెలంగాణ రాష్ట్ర మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ బజార్‌ను మైనింగ్ శాఖ ఎండీ, వైస్ చైర్మన్ భవేష్ మిశ్రా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కలిసి ప్రారంభించారు. నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఈ సాండ్ బజార్ ద్వారా ప్రజలకు టన్నుకు 1250 చొప్పున ఇసుక అందుబాటులో ఉంటుంది. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంకా తక్కువ ధరకు ఇసుకను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పేద ప్రజల సంక్షేమమే మా ధ్యేయం. తక్కువ ధరకు ఇసుకతో పాటు, స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో చర్చించి బస్తాకు 50 తగ్గింపు ధరకు సిమెంట్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే, మార్కెట్ ధర కంటే ఒక రూపాయి తక్కువకు ఇటికలు అందించేందుకు కూడా కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత మొట్టమొదటిగా మిర్యాలగూడలో ఈ తరహా సాండ్ బజార్ ఏర్పాటు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి జాకోబ్, తహసిల్దార్ సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

### కుంట తిరుపతి విమర్శ



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీ రిజర్వేషన్లను పక్కదారి పట్టించి ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బీజేపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆరోపించారు. కమాన్‌పూర్ గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్పై కాంగ్రెస్ మాట తప్పిందని, మైనారిటీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్ అమలు చేయాలని చూస్తోందన్నారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ చెప్పి, అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించాలన్నది కాంగ్రెస్ కుట్ర. బీసీ సమాజం మోసాన్ని గ్రహించింది. కాంగ్రెస్‌కు బీసీలపై చిత్తశుద్ధి లేదు," అని మండిపడ్డారు. దేశానికి తొలి బీసీ ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనని, బీసీ, దళిత, గిరిజన వర్గాలకు అత్యున్నత పదవులు కల్పించిన ఘనత కూడా తమదేనని తెలిపారు. "హిందువులను మైనారిటీలుగా మార్చే కుట్రకు కాంగ్రెస్ పథకం సిద్ధం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధం," అని విమర్శించారు.

## బీసీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న మహేశ్వరం మండల నేతలు



**మహేశ్వరం, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుల యాదయ్య నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. విజయవంతంగా నిరసన ముగించుకుని ఢిల్లీ నుండి హైదరాబాదుకు తిరిగి వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, భాస్కర్, ఐలమ్మ, దయాకర్, నరసింహ నాయక్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్

-ఆల్విన్ కాలనీలో పాదయాత్ర చేసి పరిశీలించిన ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ



**ఆల్విన్ కాలనీ,ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా నిరోధించేందుకు జీహెచ్ఎంసీ చేపట్టిన శానిటేషన్ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, కూకట్పల్లి డిప్యూటీ కమిషనర్ గంగాధర్ కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటెన్సివ్ శానిటేషన్, యాంటీ లార్వా స్ప్రే, డ్రై డే కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఉషముళ్ళపూడి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, రోడ్ సేఫ్టీ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు చెత్తను వీధుల్లో వేయకుండా తడి పొడి చెత్త వేరు చేసి ఆటోలలో వేయాలని, వర్షాకాలంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధిపై సమీక్ష

కేటీఆర్, మాధవరం నేతృత్వంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం



**శేరిలింగంపల్లి,ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో శేరిలింగంపల్లి అభివృద్ధి జరిగిందని, ప్రజలు ఇప్పటికీ ఆ పనులను గుర్తుపెట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజల్లో ఉండి సమస్యలు పరిష్కరించే దిశగా నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాల లోపంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన




**దేవరకొండ, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. సూపర్వైజర్ డి.చిట్టెమ్మ గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన పోషకాహారం, ఐరన్, క్యాల్షియం టాబ్లెట్ల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు, ఆరు నెలల వరకు తల్లిపాలు, అనంతరం అదనపు ఆహారం అవసరమని సూచించారు. ఐసిడిఎస్ అంజలి బాల్య వివాహాల నష్టాలు, హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్లు శాంతాబాయి, సునీత, పద్మ, తల్లులు పాల్గొన్నారు.

# అస్సాం ఎన్ఐటీలో సీటు సాధించిన ఏకలవ్య విద్యార్థి సుశాంత్



**వెల్దండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థి కేతవత్ సుశాంత్, అస్సాం రాష్ట్రంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), సిల్చార్‌లో సీటు సాధించి ప్రతిభను చాటాడు. పేదరికం అడ్డుగా నిలవదని, పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని సుశాంత్ తన విజయంతో నిరూపించాడని పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున సుశాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అతనిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమన్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు కోడం భాస్కర్, అనిల్, అనీష, కీర్తి, రాహుల్, అవనీష్, పర్వీన్, సాయి కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా




**వనపర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చేనేత కార్మికులు ఆర్థిక సాధికారత సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. నేతన్న భీమా, రుణ మాఫీ, పొదుపు పథకాల ద్వారా కార్మికులను ఆదుకుంటున్నామని, స్వయం ఉపాధి శిక్షణ, బ్యాంక్ లింకేజీ రుణాలు, ప్రధానమంత్రి ఉపాధి పథకం ద్వారా అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను కలెక్టరేట్‌లో నమూనాలుగా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. చేనేత దుస్తులు ధరించి విధులకు హాజరయ్యేలా అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. వ్యాస, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మాధవి, హితస్విని, ఫజియ సుల్తానా, నవ్య, సౌమ్య, గౌతమిలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో అదనపు లోకల్ బాడీస్ ఇన్‌చార్జ్ యాదయ్య, చేనేత శాఖ ఏడీవో ప్రియాంక, వెల్టూరు సొసైటీ అధ్యక్షుడు వెంకటయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, అధికారులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ఎంపీడీవో ఆవరణలో షాపుల వేలం

11వ తేదీ వరకు దరఖాస్తుల గడువు



**షాద్ నగర్, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్ నగర్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న దుకాణ సముదాయాన్ని అద్దెకు ఇవ్వడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో షాపుల కేటాయింపు కోసం సీల్డ్ టెండర్ ప్రక్రియను అమలు చేస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణకు 2025 ఆగస్టు 11వ తేదీ వరకు గడువు విధించినట్లు ఎంపీడీవో బన్సిలాల్ తెలిపారు. ఆగస్టు 12న సీల్డ్ టెండర్ల విధానంలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులకు షాపులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఎంపీడీవో / ఎంపీపీ ఫరూఖ్‌నగర్ పేరుపై రూ. 1000 విలువైన డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ షాపుల కేటాయింపు అవకాశం షాద్ నగర్, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని 47 గ్రామాల నివాసితులకు మాత్రమే పరిమితమై ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన మాజీ ఎంపీపీ రామనాథం



**అచ్చంపేట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట మండలంలోని గుంపన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం కింద మంజూరైన ఇంటికి భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులు మరియు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు, కొర్ర పద్మ లక్ష్మణ్‌కు ఇల్లు మంజూరైన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మద్దెల రామనాథం ప్రొసిడింగ్ అందజేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ధన్ రాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సౌట గణేష్, బి. పత్య, రాత్లావత్ లక్ష్మణ్, సభవట్ స్వామి, బి. రమేష్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎకో ఫ్రెండ్లీ రాఖీలతో రక్షాబంధన్ జరుపుకోండి

- కలెక్టర్ పమేలా



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్లాస్టిక్ రాఖీలకు బదులుగా సహజ సిద్ధమైన రాఖీలతో రక్షాబంధన్ జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ రాఖీ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్‌కు పర్యావరణహిత రాఖీ కట్టి చైతన్యాన్ని కలిగించారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని, రసాయనాల ప్రతిమలు పర్యావరణానికి హానికరమని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సత్తినేని శ్రీనివాస్, జక్కని సాయిరాం, సుష్మిత రెడ్డి, కిరణ్మయి రెడ్డి, సాహితి, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ తల్లి బోనాల్లో శంభీపూర్ క్రిష్ణ

బరంపేట్‌లో నాగ ప్రతిష్ట, ప్రత్యేక పూజలు



**దుండిగల్,ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దుండిగల్ మున్సిపాలిటీ బరంపేట్‌లోని శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో నాగ ప్రతిష్ట, బోనాల కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, శ్రావణమాస బోనాల పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డుల మరమ్మత్తుల కోసం బీజేపీ పాదయాత్ర

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత



**మానకొండూరు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని ప్రధాన రహదారుల రోడ్డుల మరమ్మత్తుల కోసం బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో తూర్పు దర్వాజా నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. తహసిల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, రంగు భాస్కరాచారి మాట్లాడుతూ మానకొండూరు వేగురుపల్లి, చెంజర్ల-పచ్చునూర్, ఊటూరు మార్గాల్లో రోడ్లు గుంతల మయంగా మారి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్డుల మరమ్మత్తులకు ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఉద్యమం ముమ్మరంగా కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అప్పని తిరుపతి, అంబటి తిరుపతి రాజు, మియాపురం లక్ష్మణ చారి, సోన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్ గౌడ్, శీలం కుమార్ యాదవ్, మాచర్ల కోటేశ్వర్, పోచంపల్లి శ్రీనివాస్, అశ్విన్ తేజ, ఆరెపల్లి సునంద్ రమణయ్య, ప్రదీప్ యాదవ్, రమేష్ పటేల్, శ్రీహరి, ముద్దసాని వెంకట్ రాజి రెడ్డి, భాస్కర్ రెడ్డి, భూమయ్య, కొండ్ర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత పద్మశాలీలకు ఘన సన్మానం

ఎలిగేడు పద్మశాలి భవనంలో జాతీయ చేనేత దినోత్సవం




**ఎలిగేడు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో చేనేత వృత్తిలో రాణిస్తున్న పద్మశాలీలకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మామిడాల రమేష్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల జీవితం ఆగమ్యగోచరంగా మారిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని, సబ్సిడీ యంత్రాలపై మద్దతు ఇవ్వాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాజకీయాల్లో కూడా పద్మశాలీలు ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఎలిగేడు గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోడూరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పద్మశాలి సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతుల పంపిణీ




**సుల్తాన్పూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రగతి టెక్నో స్కూల్ విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్రావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షులు శివపల్లి రాజేశం, స్కూల్ కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్, ప్రిన్సిపాల్ కావ్య, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్, ఇంచార్జ్ గోపి, ఉపాధ్యాయులు నవతా దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డేది ?







**-సింహపురి కాలనీ లో అక్రమ షేటర్లు పట్టించుకోని అధికారులు**

**దుండిగల్, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్రమ షెడ్ల నిర్మాణానికి దుండిగల్ మున్సిపాలిటీ అడ్డాగా మారింది. అడిగే వారు లేక ఎక్కడపడితే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా మమ్మల్ని అడిగేదెవరు ,ఆపేదెవరు అన్నట్టు ఇష్టానుసారంగా షేటర్ల నిర్మాణం దుండిగల్ మున్సిపాలిటీ లోని సింహపురి కాలనీ లో అక్రమ షేటర్లు వెలుస్తున్నా పట్టించుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి.అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు పొంతన లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు.స్థానికులు అక్రమంగా నిర్మిస్తున్న షేటర్లు పై దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన కూడా ఆ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మద్దతు ఇస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టిన అనుమతులు తప్పనిసరి. కానీ అక్రమార్కులు నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ షేటర్ల నిర్మాణానికి ఆజ్యం పోస్తున్నారు.ఫలితంగా దుండిగల్ మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని చాలా సందర్భాల్లో అధికారులు చెబుతున్నా ఆచరణలో అమలవట్లేదని ఆరోపణలు ఉన్నాయి.ఫిర్యాదులు చేస్తే అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపు కోవడం తప్ప అక్రమ షేటర్ల పై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

లక్ష్యం
సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

మిషన్
- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

## బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే వరకు మా పోరాటం ఆగదు

-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరికి నిరసనగా ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై ధర్నాలు చేస్తున్నా, కేంద్రం స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు.బీసీ బిల్లుపై పార్లమెంటులో చర్చ జరగాలని, రాష్ట్రపతి అపాయింట్మెంట్ ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నా ఇప్పటివరకు స్పందన లేదని తెలిపారు. "చిత్తశుద్ధి ఉంటే కేంద్రం బీసీ రిజర్వేషన్లను అడ్డుకోదు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపినా, కేంద్రం నుంచి మూడు నెలలుగా ఎలాంటి స్పందన లేదు," అని విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రధాని మోడీ బీసీ అని చెప్పుకుంటున్నా, బీసీ బిల్లుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పోరాటం వల్లే కులగణనకు మార్గం సుగమమైందని, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సైంటిఫిక్‌గా సర్వే నిర్వహించారని వివరించారు. బిల్లు అమలైతే విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించబడతాయని తెలిపారు.తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరిగితే దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. "బీసీ రిజర్వేషన్ల సాధన వరకు మా పోరాటం ఆగదు," అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, కరణ్, దాస్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 47 మంది కి తన క్యాంపు కార్యాలయంలో 2,14,000 రూపాయల విలువ గల చెక్కులు అందజేశారు ముఖ్యమంత్రి సహాయనిధీ పథకం వలన నిరుపేదలకు లబ్ది చేకూరుతుందని ఈ పథకం ద్వారా లక్షలాది మంది నిరుపేద ప్రజలకు సహాయాన్ని అందించడం హర్షదాయకమనిఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రేషన్ కార్డుల మంజూరులో దలారీ పాలన

-ఆకుల శ్రీవాణి ఆగ్రహం



**సరూర్‌నగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పూర్తిగా దలార్ల చేతుల్లోకి వెళ్లిపోయిందని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్‌నగర్ డివిజన్‌లో అసలైన లబ్ధిదారులు కార్డుల కోసం ఎదురుచూస్తున్నా, అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమని she అన్నారు. 'ఒక వర్గానికి రెడ్ కార్పెట్, మరొక వర్గానికి నిర్లక్ష్యం ఇది ఓటు బ్యాంక్ రాజకీయానికి సంక్షేమ పథకాలను తాకట్టు పెట్టినట్లే," అని ఆమె విమర్శించారు. ఫుడ్ సప్లై కార్యాలయాల్లో దరఖాస్తుల వివరాలు, తిరస్కరణల కారణాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆమె పేర్కొన్నారు."దలారీ వ్యవస్థను కట్టడి చేసి, అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేంతవరకు నేను మౌనంగా ఉండను. ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించకపోతే ప్రజల వ్యతిరేకత తప్పద," అని ఆకుల శ్రీవాణి హెచ్చరించారు.

## సర్వేంద్రియానాం నయనం ప్రధానం

-47 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధత్వ నిర్మూలన లక్ష్యంగా మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్, నస్పూర్ పరిసర గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి చూపు లోపంతో బాధపడుతున్న 47 మంది బీదవారికి లయన్స్ రేకుర్తి కంటి దవాఖానాలో ఉచిత క్యాటరాక్ట్ సర్జరీ నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమంలో ఉచిత రవాణా, మందులు, అద్దాలు, భోజన సదుపాయాలు కల్పించబడినట్లు ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం బాధితులను తిరిగి వారి గ్రామాలకు పంపించారు.క్యాంప్ నిర్వహణలో టెక్నీషియన్ ప్రభాకర్, మేనేజర్ నారాయణ, లయన్ చిదుర సురేష్, వైశ్య సేవా కేంద్రం కరీంనగర్ సభ్యులు కీలక పాత్ర పోషించారు.

## ఎంజీయూ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు




**నల్లగొండ,ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంజీయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు 20 అంశాలలో కబడ్డీ , బాస్కెట్ బాల్, హాకీ, ఖో-ఖో, బ్యాడ్ మెంటన్, హ్యాండ్ బాల్, చెస్, టేబుల్ టెన్నీస్, క్రాస్ కౌంటరీ రేస్, యోగా,అథ్లెటిక్, వాలీబాల్ , వెయిట్ లిఫ్ట్ , జూడు, క్రికెట్, సాఫ్ట్ బాల్,క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ హరీష్ కుమార్ తెలిపారు. కళాశాలల ప్రిన్సిపళ్లకు తమ విద్యార్థుల జాబితాను ఆగస్టు 15వ తేదీలోపు మెయిల్ ద్వారా పంపాలని ఆయన కోరారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి: నాగం వర్షిత్ రెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా బిజెపి కార్యాలయంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికులు ఐక్యంగా ఉంటూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు అనంతరం చేనేత కార్మికులకు ఘనంగా సన్మానం చేశారు మిరియాల వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, కోమటి వీరేశం, పోతేపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతం లాంటివి

## - బిడ్డ ఆరోగ్యానికి తప్పనిసరి



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తల్లిపాలు కేవలం ఆకలి తీర్చడమే కాకుండా, ఔషధ గుణాలు కలిగి రోగనిరోధక శక్తిని పెంచుతాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కళాభారతిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.సాధారణ ప్రసవం అయినా, సిజేరియన్ అయినా మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలు, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ కోసం ప్రత్యేక క్యాలెండర్ రూపొందించబడిందని వివరించారు.

**ఆరు నెలల వరకు తల్లిపాలే - ఆ తర్వాత పోషకాహారం**

అడిషనల్ కలెక్టర్ అశ్విని వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి తదితరులు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించగా, చల్మెడ నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రొఫెసర్ బీజు ఆధ్వర్యంలో నాటకం, నృత్య రూపకం ప్రదర్శించారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ వేణుమాధవ్, సిడిపిఓ సబిత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తల్లులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసి విజితా రెడ్డి



**వెల్దండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసి డాక్టర్ ద్యాప విజితా రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులను కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తూ కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు ముందస్తు చర్యలు



**ఎలిగేడు, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సమావేశం జరిగింది. మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన అధ్యక్షత వహించారు. "నులిపురుగులు పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అభివృద్ధిలో మందకూడుదల కలిగిస్తాయి. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని ఆమె పేర్కొన్నారు. మండలంలో 1-19 ఏళ్ల పిల్లలు 3,378 మంది ఉండగా, వీరందరికీ ఆగస్టు 11 నుంచి 18 వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కరరావు, ఎంఈఓ నరేంద్ర చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విషాద సమయంలో ఆర్థిక సాయం అందించిన కొత్త జయపాల్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన పోత్తూరి బాబు అమ్మగారు ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న కొత్త జయపాల్ రెడ్డి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని పది వేల ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో సిరిమల్ల చందు, పోతూరి ప్రభాకర్, బీరెడ్డి కరుణాకర్ రెడ్డి, బండారి శ్రీనివాస్, గుర్రం రాజిరెడ్డి, ఊకంటి శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గదు

## - కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు నేత కార్మికులు, విద్యార్థులు పాల్గొన్న ర్యాలీని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ప్రారంభించారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. "చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గదు. నేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది," అని ఆమె పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవలు - కార్మికుల కోసం ప్రత్యేక పథకాలు**

జిల్లాలోని నేత కార్మికులకు హెల్త్ క్యాంపులు, ఆరోగ్య కార్డులు, ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్య సహాయం వంటి సేవలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళా కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో బీపీ, షుగర్, థైరాయిడ్ మాత్రలు ఉచితంగా పొందవచ్చని సూచించారు.

**రుణాలు - గురుకులాల్లో సీట్లు - ఇందిరమ్మ మంజూరు**

నేత కార్మికుల రుణాల మంజూరు, వారి పిల్లలకు గురుకులాల్లో సీట్లు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**పురస్కారాలు - ప్రదర్శనలు**

చేనేత పురస్కారాలు అందుకున్న కార్మికులను కలెక్టర్ సన్మానించారు. సహకార సంఘాలకు రుణ చెక్కులు అందజేశారు. చేనేత వస్త్రాల ప్రదర్శనను సందర్శించి, సాంప్రదాయ మగ్గాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జౌళి శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, నేత కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో విమానాశ్రయంపై కేంద్ర మంత్రిని కలిసిన సుడా చైర్మన్



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలోని మంత్రిత్వ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు సర్వే జరిపి నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు."గతంలో సర్వే జరిగినా, కార్యరూపం దాల్చలేదు. కరీంనగర్ జిల్లాలో విదేశాల్లో నివసించే ప్రజలు, విస్తరించిన గ్రానైట్ పరిశ్రమ నేపథ్యంలో విమానాశ్రయం అవసరం," అని నరేందర్ రెడ్డి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో అధికార బృందాన్ని పంపిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి కూడా ఉన్నారు.

# కేజీబీవీ హాస్టళ్ల నిర్వహణపై సమీక్ష చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), హాస్టల్స్, వసతి గృహాల నిర్వహణపై గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మంజూరునగర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.విద్యార్థులకు సురక్షిత వసతి, సమతుల్య ఆహారం, నీటి సౌకర్యం, నర్సుల నియామకం వంటి అంశాలపై ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. "విద్యార్థుల భవిష్యత్తు పట్ల శ్రద్ధ వహించాలి. ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోము," అని స్పష్టం చేశారు.సమీక్షలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# కట్కూర్ పాఠశాలలో ఘనంగా ముందస్తు రాఖీ పండుగ వేడుకలు



**అక్కన్నపేట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్. రఘు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఈ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా హెచ్ఎం రఘు మాట్లాడుతూ, "రాఖీ పౌర్ణమి మన భారతీయ సంస్కృతిలో బంధాల బలం, ప్రేమ, భద్రతకు ప్రతీక. విద్యార్థులు చిన్నప్పటి నుండే ఈ విలువలను హృదయంలో నిలుపుకొని ఎదగాలి," అని సూచించారు. విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టి సోదరభావాన్ని వ్యక్తం చేశారు.విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలను ప్రదర్శిస్తూ తమ సృజనాత్మకతను చాటారు. అనంతరం గీతాలు, పద్యాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పండుగకు మరింత ప్రత్యేకత చేకూరింది.

# జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సమత ప్రకాష్



**బాలాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సమత ప్రకాష్ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేతకు మానవ నాగరికత ప్రగతిలో విశిష్ట స్థానం ఉందని, ప్రజా ప్రభుత్వం పునరుజ్జీవం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పాత బకాయిల విడుదల, లక్ష రూపాయల వరకు రుణ మాఫీ, నేతన్న బీమా, పొదుపు, అభయ హస్తం వంటి పథకాల ద్వారా చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

# ప్రతి గ్రామీణ గృహానికి తాగునీరు అందించాలి

## కమల్ కిషోర్




**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జల్ జీవన్ మిషన్ పథకం అమలుపై గురువారం ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మిషన్ డైరెక్టర్, అడిషనల్ సెక్రటరీ కమల్ కిషోర్, రాష్ట్ర కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు.ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నాయని తెలిపారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇవ్వడమే ప్రధాన లక్ష్యమని, అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.సామాజిక భవనాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చి 100 శాతం కొళాయి కనెక్షన్లు పూర్తి చేయాలని సూచించారు. నీటి నాణ్యత, నిర్వహణ, అవగాహన కార్యక్రమాల్లో ఐఎస్ఏలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డీఆర్డీవో శ్రీధర్, రూరల్ వాటర్ సప్లై ఎస్ఈ రాములు, రాంకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్టోబర్ 12న జరగబోయే కరీంనగర్ హాఫ్ మారథాన్ 3వ ఎడిషన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గత రెండు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహించిన మారథాన్‌కు ఈసారి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.ఆరోగ్యంపై అవగాహన పెంచుతున్న కరీంనగర్ రన్నర్స్, సైకిలిస్ట్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.

# జిల్లా అభివృద్ధికి ఉద్యమాలు తప్పవు

## – సిపిఐ




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు తప్పవని సిపిఐ రాష్ట్ర నేత ఎం. బాల నరసింహ హెచ్చరించారు. లక్ష్మణచారి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ.5 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీతో జిల్లా అభివృద్ధి చేయాలని, నల్లమలలో పరిశ్రమలు, పాలెం వద్ద ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి నియోజకవర్గానికి పాలిటెక్నిక్, జిల్లా కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కేఎల్ఐ, పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వాలని, బెల్ట్ షాపులు, కల్తీ కల్లును అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండండి!

## – పాండురంగారెడ్డి



**రంగారెడ్డి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వ్యాప్తంగా సాయంత్రం నుండి భారీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాండురంగా రెడ్డి సూచించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పాత భవనాల్లో నివసించే వారు తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.విద్యుత్ స్తంభాలు, తడి పరికరాల దగ్గర జాగ్రత్త, వృద్ధులు, పిల్లలు, గర్భిణులు భద్రమైన చోట ఉండేలా చూడాలని తెలిపారు. వాహనదారులు నెమ్మదిగా డ్రైవ్ చేయాలని, నీటిలో నడవరాదని హెచ్చరించారు.స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైతే వైద్య, రవాణా సహాయం అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# పటాన్‌చెరులో రోడ్డు సమస్యపై బీజేపీ పాదయాత్ర




**గుమ్మడల, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడల మండలంలో రోడ్డు సమస్యలపై ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నేతృత్వంలో కనుకంట నుండి గుమ్మదల టౌన్ వరకు పాదయాత్ర నిర్వహించారు.8 గ్రామాల రహదారుల పరిస్థితి దయనీయంగా మారిన నేపథ్యంలో, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంగా ఈ కార్యక్రమం జరిగింది.పాదయాత్రలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, శంషాబాద్ రాజు, మండల అధ్యక్షులు కావాలి ఇలేష్, మాజీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, స్థానిక యువత, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రోడ్డు సమస్య తక్షణమే పరిష్కరించాలన్న డిమాండ్‌తో నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అన్నా –చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓ ప్రైవేట్ పాఠశాల చిన్నారులు కలెక్టర్‌కు రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు. కలెక్టర్ వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, "రాఖీ పండుగ భారతీయ సంస్కృతికి ప్రతిబింబం. ఇది కుటుంబ బంధాలను బలపరుస్తుంది," అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రికి విజ్ఞప్తి పత్రం అందజేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్, ఛైర్మన్ వీరయ్య



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వికలాంగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఆవశ్యక చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఢిల్లీలో కేంద్ర మంత్రి డాక్టర్ వీరేందర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాస్త్రి భవనలోని మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేంద్రానికి విజ్ఞప్తి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం ఐజీఎన్డిపిఎస్ పథకం కింద 18 నుండి 79 ఏళ్ల వికలాంగులకు 300, 80 ఏళు పైబడిన వారికి 500 పెన్షన్ మాత్రమే అందుతోందని, 2014 నుండి కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఒక్క రూపాయి కూడా పెంచలేదని గుర్తు చేశారు. గత పదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ?300 పెన్షన్ వికలాంగుల ప్రాథమిక అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ దాదాపు ?20 లక్షల కోట్లకు చేరుకున్నప్పటికీ, వికలాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం 5 శాతం కేటాయింపుతో కనీసం 1 లక్ష కోట్లను వికలాంగుల సంక్షేమానికి వినియోగించాలని కోరారు.ప్రస్తుతం 80 శాతం వైఖల్యం ఉన్నవారికే పెన్షన్ అందిస్తున్న విధానం సరైనది కాదని, 18 ఏళ్లు నిండిన తర్వాతే పెన్షన్ ఇవ్వడం చట్టానికి విరుద్ధమని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం 40 శాతం బెంచ్‌మార్క్ వైఖల్యంతోనే అన్ని సంక్షేమ పథకాలకు అర్హత కల్పించాల్సిందిగా కేంద్రాన్ని కోరారు.

# జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**శాయంపేట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పాత బకాయిల విడుదల, రూ.లక్ష వరకు రుణ మాఫీ, చేనేత అభయ హస్తం, నేతన్న పొదుపు, నేతన్న బీమా, నేతన్నకు భరోసా వంటి పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు, కాంగ్రెస్ మండల నేతలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ

## – ఏడీఏ చంద్రశేఖర్



**వంగూరు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఎరువుల దుకాణాలను అచ్చంపేట వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం. చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు, నిల్వల రికార్డులు పరిశీలించిన ఆయన, రైతులకు పారదర్శకంగా సరఫరా కోసం ఈపీఓఎస్ విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండలంలో 700 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, కొరతపై రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.మోతాదుకు మించి యూరియా వాడకూడదని హెచ్చరించిన ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, ఇతర అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

# రాఖీ పండుగ ముందస్తు సంబరాల్లో పాల్గొన్న వెంకట్రావు పల్లె పాఠశాల



**కరీంనగర్,ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రామడుగు మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల వెంకట్రావు పల్లిలో ముందస్తు రాఖీ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని అమ్మాయిలు అబ్బాయిలకు రాఖీలు కట్టినారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిర్మయి మేడం మాట్లాడుతూ రాఖీ పండుగ విశిష్టతను తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిర్మయి మేడం మరియు ఉపాధ్యాయులు కరుణాకర్, రవీందర్, ఆంజనేయులు, మరియు గీత మేడం శ్రీలత మేడం పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయండి

## –సునీల్ రావు



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ నేత, మాజీ మేయర్ సునీల్ రావు పిలుపునిచ్చారు.ఆగస్టు 10 నుండి 15 వరకు తిరంగా యాత్రలు, దేశభక్తి కార్యక్రమాలు, స్వచ్ఛతా కార్యక్రమాలు, వీరుల కుటుంబాల సన్మానాలు నిర్వహించాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్ దేశ గర్వకారణమని, త్రివర్ణ పతాకాన్ని ప్రతి ఇంటిపై ఎగరవేయాలని, పిల్లల చేత జెండాలు ఎగర వేయించాలన్నారు.ఈస్ట్ జోన్ సమావేశంలో బొంతల కళ్యాణ్ చంద్ర, అవదుర్తి శ్రీనివాస్, మాసం గణేష్, లెక్కల వేణు, పాశం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలపై సీఎస్‌ను

# కలిసిన ఫెడరేషన్ ప్రతినిధులు



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల ఫెడరేషన్ జాతీయ ప్రతినిధులు సుధాకర్, రాజేంద్ర బాబు, ఎం.సీ. లింగన్న, మహేంద్ర రెడ్డి, ఉమాదేవి, నాగమాంబ తదితరులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావును హైదరాబాద్ సచివాలయంలో కలిశారు.పెన్షనర్లకు ఈహెచ్ఎస్ వైద్య సదుపాయం, పిఆర్సి అమలు, పెండింగ్ డీఆర్ల విడుదల వంటి అంశాలపై విజ్ఞప్తి పత్రం అందజేశారు. సీఎస్ సానుకూలంగా స్పందించి, త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎం.సీ. లింగన్న సీఎస్‌ను శాలువాతో సత్కరించారు.


# చేనేతకు ప్రాధాన్యం తిరంగా అభియాన్ విజయవంతం చేయాలి

**మానకొండూరు, ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చేనేత వస్త్రాలు భారతీయ సంప్రదాయాలకు ప్రతీకగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తాయని బీజేపీ జిల్లా ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని పచ్చునూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.చేనేత రంగ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, తిరంగా అభియాన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా దేశ శక్తిని ప్రపంచానికి చాటిచెప్పామని, ప్రతిపక్షాలు మాత్రం విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు.కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు సన్మానితులయ్యారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పుతిన్‌తో ధోవల్ భేటీ..

– 'వ్యూహాత్మక భాగస్వామ్యం' ఎజెండాగా చర్చలు..!



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా సుంకాల మోత మోగిస్తున్నా భారత ప్రభుత్వం మాత్రం తగ్గేదేలే అంటోంది. రష్యాతో ముడిచమురు కొంటున్నందుకు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు, సుంకాలను లెక్కచేయకుండా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన వెళ్లారు. గురువారం ఆయన ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో భేటి అయ్యారు. మాస్కోలోని క్రెమ్లిన్ లో సమావేశం అయిన ఈ ఇద్దరూ వ్యూహాత్మక భాగస్వాములుగా ఉండడంపై ఇరువురు చర్చించే అవకాశముందని రష్యాకు చెందిన న్యూస్ ఏజెన్సీ ఆర్ఐఏ వెల్లడించింది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో పుతిన్, ధోవల్ భేటి ప్రాధాన్యం సంతరించుకుంది.రష్యా, భారత్ చమురు ఒప్పందంపై మండిపడుతున్న డొనాల్డ్ ట్రంప్ సుంకాలను పెంచుతూ పోతున్నారు. ఆగస్టు 1 నుంచి 25 శాతం టారీఫ్ విధిస్తున్నట్టు చెప్పిన ఆయన.. మరోసారి సుంకాలను 25కు పెంచారు. దాంతో.. భారత్ దిగుమతి చేసుకొనే వస్తువులపై 50 శాతం సుంకాల భారం పడనుంది. అయినా సరే అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలకు భయపడేది లేదని మోడీ ప్రభుత్వం స్పష్టం చేసింది.తమకు దేశ ప్రయోజనాలే ముఖ్యమని, అంతర్జాతీయ విపణిలో ఎవరివద్దనైనా చమురు కొనే హక్కు తమకు ఉందని ట్రంప్ వ్యాఖ్యల్ని కొట్టిపారేశారు ప్రధాని. ఇదే అంశంపై రష్యా అధ్యక్షుడితో మాట్లాడేందుకు జాతీయ భద్రతా సలహారు అజిత్ ధోవల్‌ను రంగంలోపి దింపారు మోడీ.

# భారత్‌తో టారిఫ్ ఉద్రిక్తతల వేళ.. మరోసారి అమెరికాకు పాక్ ఆర్మీ చీఫ్



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ విషయాన్ని పాక్ మీడియా వెల్లడించింది. ఈ నెలలో సెంట్రల్ కమాండ్ జనరల్ కురిల్లా పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మునీర్ వాషింగ్టన్ వెళ్తున్నట్లు సమాచారం.కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. భారత్‌పై అధిక సుంకాలు, పెనాల్టీలు విధించిన ట్రంప్.. పాకిస్థాన్‌తో జట్టుకట్టారు. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. పాక్‌తో భారీ చమురు నిల్వల అభివృద్ధికి ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. భారత్‌కు పాకిస్థాన్ ఏదో ఒక రోజు చమురు విక్రయించవచ్చని వెల్లడించారు. భాగస్వామ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నదని తన సామాజిక మాధ్యమం ట్రూత్ వేదికగా తెలిపారు.

# డేంజర్ మార్క్‌ను దాటిన యమునా నది ప్రవాహం..

ఆందోళనలో ఢిల్లీ వాసులు



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఢిల్లీ లో యమునా నది నీటి ప్రవాహం డేంజర్ మార్క్ ను దాటింది. గత కొన్ని రోజులుగా ఢిల్లీకి ఎగువన ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు యమునా నదికి వరద పోటెత్తుతోంది. పాత రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటిమట్టం 204.50 మీటర్ల ప్రమాద స్థాయిని దాటింది. గురువారం ఉదయం 8 గంటల సమయానికి నదిలో నీటి మట్టం 204.88 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు.నదిలో నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి ప్రతి గంటకు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయడం వల్ల యమునా నదిలో ప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయానికి గరిష్టంగా 61 వేల క్యూసెక్కుల నీరు యమునా నదికి వచ్చి చేరినట్లు పేర్కొన్నారు. యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరడంతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఓ సారి యమునా నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహించడంతో రాజధాని ప్రాంతం నీట మునిగిన విషయం తెలిసిందే.

# ఆ వ్యాధి తమిళనాడుకు పరిమితం కాదు.. దేశవ్యాప్తంగా ఉంది..!

సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలపై ఉన్న ఏ కేసునైనా దర్యాప్తు లేకుండా ఉపసంహరించుకోకూడదని సుప్రీంకోర్టు తమిళనాడూ ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో ప్రస్తుత మంత్రులపై పెండింగ్‌లో ఉన్న కేసులను రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విషయంలో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ ప్రభుత్వానికి సూచించింది.తమిళనాడులో సిట్టింగ్ మంత్రులపై పెండింగ్‌లో ఉన్న కేసులను రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని కోరుతూ చెన్నైకి చెందిన న్యాయవాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల వాదనల ప్రకారం.. కొంతమంది రాష్ట్ర మంత్రులు, రాజకీయ నాయకులపై ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని రాజకీయల కారణంగా ఏజెన్సీలు ఉపసంహరించుకున్నాయని, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ కోర్టుకు హాజరయ్యారు. పిటిషనర్ అనవసరంగా కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే, రాష్ట్రం ప్రభుత్వం పిటిషనర్‌కాకుండా కోర్టును సంతృప్తి పరచడానికి అఫిడవిట్ దాఖలు చేస్తుందని ధర్మాసనం తెలిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది డీఎస్ నాయుడు హాజరయ్యారు. దర్యాప్తు పూర్తి కాకముందే ఆమోదం ఉపసంహరించుకున్న సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి కేసుల్లో న్యాయ పర్యవేక్షణ కోసం ఆయన డిమాండ్ చేశారు. పిటిషనర్ సమగ్రతపై ఆరోపణల నేపథ్యంలో జస్టిస్ భుయాన్ న్యాయవాది నాయుడుతో మాట్లాడుతూ ఈ వ్యాధి తమిళనాడుకే పరిమితం కాదని.. ఇది మొత్తం దేశమంతటా ఉందని అన్నారు. కేసు విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేశారు.


# 'ప్రజలను తప్పుదోవ పట్టించకండి'..

రాహుల్ గాంధీకి ఈసీ వార్నింగ్..!




**బెంగుళూర్ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కర్నాటకలో భారీగా నకిలీ ఓట్లతోనే బీజేపీ గెలిచిందని, ఆ పార్టీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయిందని ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం మండిపడింది. విపక్ష నేత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికింది. ఆరోపణలు చేయడం కాదు ఆధారాలు చూపాలని.. సంతకం చేసి ఎన్నికల సంఘానికి సమర్పించాలని రాహుల్‌కు సవాల్ విసిరింది ఎన్నికల సంఘం.నకిలీ ఓట్ల విషయంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న వాఖ్యలు పూర్తిగా అబద్ధమని పేర్కొన్న ఈసీ ఆయనను ప్రమాణం చేయాలని కోరింది. 'ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాకు సంబంధించి రాహుల్‌కు ఏమైనా సందేహాలు ఉంటే ఆయన నిబంధన 20(3)(ఎ) ప్రకారం రాహుల్ తన ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. అంతేకాదు సతకం చేసిన పేపర్లను ఈసీకి సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆయనకు తన మాటలపై విశ్వాసం లేకుంటే.. అనవసరమైన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. లేనిపోని ఆరోపణలు చేస్తూ జనాలను తప్పుదోవ పట్టించడం సరికాదు' అని ఎక్స్ వేదికగా రాహుల్‌కు తెలియజేసింది ఈసీ.గురువారం రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల సమయంలో మహదేవపుర నియోజవర్గంలో బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తూ అతిపెద్ద నేరానికి పాల్పడిందిన ఈసీని దుయ్యబట్టారు రాహుల్. ఆ స్థానంలో గెలిచేందుకు దాదాపు 1,00,250 నకిలీ ఓటర్లను సృష్టించారని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి 32,707 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.


# త్వరలోనే ఇండియాకు పుతిన్



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలోనే ఇండియాలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు చెందిన తేదీలు దాదాపు ఖరారు అయినట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ తెలిపారు. ప్రస్తుతం ధోవల్.. మాస్కోలో ఉన్నారు. అయితే ఈనెల చివరలో ఆ భేటీ జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రష్యాతో వాణిజ్యం విషయంలో భారత్‌పై అమెరికా అదనపు సుంకం విధిస్తున్న నేపథ్యంలో మోదీ, పుతిన్ భేటీ కీలకం కానున్నది.భారత్, రష్యా మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యం అంశాలపై ధోవల్ చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్–400 సిస్టమ్స్ అంశంలో రష్యాతో ఆయన చర్చించనున్నారు. ప్రస్తుతం ఇండియా వద్ద మూడు ఎస్–400 డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇటీవల పాక్‌తో జరిగిన ఉద్రిక్తతల వేళ వాటిని వాడారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనూ ధోవల్ రష్యాలో పర్యటించారు. ఆ టూరు సమయంలో ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. మరో వైపు ట్రంప్, పుతిన్ కూడా భేటీకానున్నారు. ఆ ఇద్దరి భేటీకి వేదికను డిసైడ్ చేసినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. భేటీకి సంబంధించిన వేదిక అంశంలో రెండు దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల మాస్కోలో పర్యటించారు. ఆయన పర్యటన తర్వాత ఇద్దరు అగ్రనేతలకు చెందిన మీటింగ్‌పై అంగీకారం కుదిరినట్లు అంచనా వేస్తున్నారు. ఈ భేటీకి జెలెన్‌స్కీని కూడా ఆహ్వానించాలని అమెరికా నిర్ణయించింది. కానీ దీనిపై రష్యా స్పందించలేదు.ఈనెల చివరలో ప్రధాని మోదీ.. చైనాలో పర్యటించనున్నారు. ఆ పర్యటనకు చెందిన నిర్ణయం తీసుకున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అవుతారు. అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఇండియా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం ఫెయిల్


-మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 25శాతం పన్నులు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో పన్నులు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. దాంతో భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు వెళ్లే వస్తులపై మొత్తం 50శాతం పన్నులు విధించనున్నారు. అయితే, ట్రంప్ టారిఫ్స్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. సుంకాలు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యంగా అభివర్ణించారు.భారత దౌత్యం బలహీనంగా, గందరగోళంగా కనిపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారని.. ట్రంప్ నిరంతరం భారత్‌పై ఒత్తిడిని తీసుకువస్తున్నారని ఆరోపించారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ట్రంప్.. భారత్ నుంచి అమెరికాకు వచ్చే అనేక ఉత్పత్తులపై అదనంగా 25శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ 25శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే 25శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని.. మంత్రులు నెలల నుంచి చర్చల గురించి మాట్లాడుతున్నారని.. మరికొందరు వాషింగ్టన్‌లో మకాం వేసినా ఏం జరుగలేదన్నారు. ఈ క్రమంలో పెద్ద దెబ్బ తగిలిందని.. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఆరునెలలుగా మోదీ ప్రభుత్వం అమెరికాతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేకపోయిందని.. ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్నా.. మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రంప్ బ్రిక్స్, వందశాతం సుంకాలపై వ్యాఖ్యానించినా ప్రధాని ఏమీ మాట్లాడలేదన్నారు. అమెరికా సుంకాల విధానంపై, ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 50శాతం సుంకాలతో దాదాపు రూ. 3.75 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పాడి పరిశ్రమ, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, పెట్రోలియం, వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రమాదానికి గురైన సీఆర్‌పీఎఫ్ జవాన్ల వాహనం..

ముగ్గురు మృతి



**న్యూఢిల్లీ ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జమ్ముకశ్మీర్ లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉదంపూర్ జిల్లా కద్వా బసంత్‌గఢ్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుమారు 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన జవాన్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఉదంపూర్ అడిషనల్ ఎస్పీ సందీప్ భట్ తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలో 23 మంది జవాన్లు ఉన్నట్లు చెప్పారు.